ప్రజాశక్తి
గురువారం 6 జూన్ 2024 5
అనంతపురం

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి

వైసిపిలో నైరాశ్యం..!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వైసిపి శ్రేణులను తీవ్రమైన నైరాశ్యంలో నెట్టివేశాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క స్థానం కూడా దక్కకపోవడం ఆ పార్టీ నేతలను విస్తుపోయేలా చేస్తోంది. సంక్షేమ పథకాల వల్ల తమకు తిరుగుండదని భావిస్తూ వచ్చిన వైసిపికి ఈ ఫలితాలు షాక్ నిచ్చాయి. ఓట్ల లెక్కింపు పూర్తయినప్పటి నుంచి ఫలితాలను చూసి కొలుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఎందుకు ఇలా జరిగిందన్నది అంతుబట్టక అయోమయంలో పడ్డారు. జిల్లాలో సీనియర్లుగా ఉన్న నేతలతోపాటు, కొత్తవారికి కూడా ఓటమి తప్పలేదు. ఈ ఓటమిపై ఇంకా విశ్లేషణ చేసుకునే స్థితిలోనూ ఆ పార్టీ నేతల్లేరు. ఆ పార్టీలో అంతా నిశబ్ధ వాతావరణవమే నెలకొంది.

- మార్పులు చేసినా ఫలించని వ్యూహం
- ఒక్క స్థానం కూడా రాకపోవడంతో డీలా
- తప్పిన ఐ ప్యాక్ అంచనాలు
- నేతల్లో అంతర్మథనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అభ్యర్థుల ఖరారులోనూ అనేక జాగ్రత్తలను వైసిపి తీసుకుంది. వివిధ రకాల సర్వేలను ముందు పెట్టుకుని అభ్యర్థులను మార్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలుంటే ఏడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చింది. రెండు పార్లమెంటు స్థానాల్లోనూ మార్పులు చేపట్టింది. అయినా ఫలితం ఆశించినంత కనిపించలేదు. మార్పులు చేపట్టిన నియోజకవర్గాలు చూస్తే అనంతపురం పార్లమెంటు సభ్యులుగానున్న తలారి రంగయ్యను బీసీ సామాజిక తరగతిలో భాగంగా కళ్యాణదుర్గం అసెంబ్లీకి మార్చింది. అక్కడున్న మంత్రి ఉషశ్రీచరణ్‌ని పెనుకొండ అసెంబ్లీకి మార్చింది. అక్కడ ఎమ్మెల్యేగానున్న శంకరనారాయణను అనంతపురం పార్లమెంటుకు మార్చింది. ఇక హిందూపురానికి అంతకముందున్న మహమ్మద్ ఇక్బాల్‌ను తప్పించి దీపికను కొత్తగా తీసుకొచ్చారు. కదిరిలోనూ సిద్దారెడ్డిని తప్పించి మక్బుల్‌ను తీసుకొచ్చారు. మైనార్టీ అయితే కదిరి పట్టణంలో వర్కవుట్ అవుతుందని భావించారు. ఈ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. శింగనమలకు జొన్నలగడ్డ పద్మావతిని తప్పించి వీరాంజినేయులును తీసుకొచ్చారు. ఆయన టిప్పర్ డ్రైవరంటూ పెద్దఎత్తు ప్రచారం చేపట్టి సామాన్యుడికి టిక్కెట్టు ఇచ్చామని సానుభూతి ఓట్ల సంపాదించే ప్రయత్నంచేశారు. అదీ ఫలించలేదు. మడకశిరలోనూ వీరలక్కప్పను ఇదే రకంగా బరిలో దింపారు. అసలు టిడిపి చివరి క్షణంలో ఎంఎస్.రాజును బరిలో దింపింది. దీంతో ఆయన విజయం ఏ మేరకన్నది ప్రశ్నార్థకంగా ఉండింది. తక్కువ ఓట్ల మెజార్టీతో అయినా ఎంఎస్.రాజు విజయం సాధించారు. రాయదుర్గంలో కాపు రామచంద్రారడ్డిని కాదని మెట్టుగోవిందరెడ్డిని తీసుకొచ్చింది. ఇక్కడా ఓటమి తప్పలేదు. ఇలా మార్పులు చేసిన ఏడు చోట్ల ఓటమి చవిచూడక తప్పలేదు. మార్పు జరగని మరో ఏడు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అనంతపురంలో సీనియర్ నాయకులు అనంత వెంకటంరామిరెడ్డి, తాడిపత్రిలో సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, గుంతకల్లులో వై.వెంకటరామిరెడ్డి, ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రాప్తాడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పుట్టపర్తి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీరికి ఓటమి తప్పలేదు. ఇలా రెండు విధాలుగా వైసిపి ఎత్తుగడలు ఫలించలేదు.

ఐ ప్యాక్ అంచనాలు తప్పాయా..

ఎన్నికల వ్యూహాల కోసమే ఏర్పాటు చేసుకున్న ఐ ప్యాక్ అంచనాలు కూడా తప్పాయా అన్న చర్చ నడుస్తోంది. వైసిపి కోసం పనిచేసిన ఈ సంస్థ జిల్లాలో పది వరకు సీట్లు వస్తాయని అంచనా వేసినట్టు వైసిపి శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. ఈ అంచనాలు పూర్తిగా తప్పాయి. ఐప్యాక్ చెప్పినట్లు కనీసం ఒకటి, రెండు సీట్లలో కూడా గెలవకపోవడం వైసిపి శ్రేణులను నిరుత్సాహానికి గురి చేస్తోంది.

గొడవలకు దూరంగా ఉండండి : ఎస్పీ

సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి - ఆత్మకూరు

గొడవలు, అల్లర్ల జోలికెళ్లకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని ఎస్పీ గౌతమిసాలి విజ్ఞప్తి చేశారు. రాప్తాడు మండలం బుక్కచెర్ల, పాలచెర్ల, ఆత్మకూరు మండలం తోపుదుర్తి, సనప, మదిగుబ్బ, బి.యాలేరు గ్రామాల్లో ఎస్పీ బుధవారం పర్యటించారు. అక్కడి పరిస్థితులపై గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ఘట్టం పూర్తిగా ముగిసిందని, ఇక వాటిని మరచి గ్రామాల్లో ఒకరికొకరు స్నేహ పూరిత వాతావరణంలో జీవించాలని కోరారు. ఘర్షణలు, హింసాత్మక ఘటనల జోళికెళ్లి కేసుల్లో ఇరుక్కుపోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల ద్వారా చట్టపరిధిలో పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రశాంతత లోపించే విధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాల పర్యటనకు మునుపు రాప్తాడు పోలీసు స్టేషన్ ఎస్పీ సందర్శించారు. ఆ పోలీసు స్టేషన్ పరిధిలోని తాజా పరిస్థితులను సి.ఐ మునిస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ముగిసినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దష్టి కొనసాగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి, ఇటుకలపల్లి సిఐ నరేంద్రరెడ్డి ఉన్నారు.

కౌంటింగ్ విధుల్లో పోలీసు సిబ్బంది పనితీరు భేష్

అనంతపురం క్రైం : కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసేందుకు భద్రతా చర్యలు చేపట్టిన పోలీసు సిబ్బంది పని తీరు చాలా బాగుందని ఎస్పీ గౌతమిసాలి తెలియజేశారు. జిల్లాలో మంగళవారం నాడు కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర బలగాలతో బుధవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. అందరూ సమిష్టిగా కష్టపడటం వల్లనే జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ప్రతీ ఒక్కరూ అంకితభావం, చిత్తశుద్ధితో పని చేయడం సంతోషకరం అన్నారు. పోలింగ్ తర్వాత తలెత్తిన ఘర్షణలు, అల్లర్ల వల్ల అందరి దష్టి జిల్లాపైన ఉండేదన్నారు. ఎన్నికల్లో కీలక ఘట్టమైన కౌంటింగ్ ప్రశాంతంగా ముగించేలా ఉత్తర్వులు జారీ కావడంతో పాటు అదనంగా బలగాలు వచ్చాయన్నారు. ఎలాంటి చిన్న ఘర్షణలు కూడా చోటు చేసుకోకుండా ప్రశాంతంగా కౌంటింగ్ ముగియడం శుభ పరిణామం అన్నారు. ఇదే స్ఫూర్తితోనే మరికొన్ని రోజులు శ్రమించి జిల్లాను ప్రశాంతంగా ఉంచుదామని పిలుపునిచ్చారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన జిల్లా ప్రజలకు ఎస్పీ ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో పలువురు డీఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కేంద్ర, రాష్ట్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చండి

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు ఉద్యోగుల ఆదరణతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమికి సిఐటియు జిల్లా కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు కోరికలకు అనుగుణంగా ఇచ్చిన హామీలు అమలు చేస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం నూతన ప్రభుత్వం పనిచేయాలని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల నాణ్యమైన జీవన ప్రమాణాల కోసం, సమాన పనికి సమాన వేతనం కోసం, ఉద్యోగుల రెగ్యులర్ కోసం కూటమి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యా, విద్యుత్, వైద్య, యూనివర్సిటీ, స్థానిక సంస్థలు, మున్సిపల్, ఆర్టీసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, సమగ్ర శిక్షా, కేజీబీవీ, నేషనల్ హెల్త్ మిషన్, 108, 104, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మిత్ర, ,వెలుగు, ఉపాధి హామీ, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజనం, మున్సిపల్, గ్రామపంచాయతీ, సివిల్ సప్లయ్ తదితర పథకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రెగ్యులర్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష ప్రత్యేక హోదా, విభజన హామీలు, రెవెన్యూ లోటు బడ్జెట్ సర్దుబాటు, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఇతర ప్రాంతాలకు తోడ్పాటు, పెండింగ్ ఉన్న ప్రాజెక్టులు అమలు, ధరల నియంత్రణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, రైతుల గిట్టుబాటు ధర, కార్మికుల కనీస వేతనాలు భద్రత పైన కూటమి ప్రయత్నం పని చేయాలని కోరారు.

నీట్‌లో 885వ ర్యాంక్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కుమారుడికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

నీట్ ఫలితాల్లో (ఆల్ ఇండియా నీట్‌లో) శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థి గుర్రం రామ్‌చైతన్య ఓబీసీ కింద 885వ ర్యాంకు సాధించారు. నీట్‌లో 720 మార్కులకు గానూ 696 మార్కులు సాధించాడు. దీంతో ఆల్ ఇండియా కోటాలో 2,545వ ర్యాంకు రాగా ఓబీసీ కింద 885 ర్యాంకు దక్కింది. విద్యార్థి తండ్రి గుర్రం లక్ష్మీనారాయణ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. రామ్‌చైతన్య ఇంటర్‌లో 978 మార్కులు, నీట్‌లో ఓబీసీ కింద 885వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు గుర్రం లక్ష్మీనారాయణ, రుక్మిణి హర్షం వ్యక్తం చేశారు. రామ్‌చైతన్య మాట్లాడుతూ ఎంబీబీఎస్ తర్వాత న్యూరోసర్జన్ చేయాలన్నదే తన ఆశయమన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డిఎఫ్ఒ వినీత్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డిఎఫ్ఒ వినీత్ కుమార్ తెలియజేశారు. బుధవారం నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు మండలం పంపనూరు నాగారవణంలో డిఎఫ్ఒ, అటవీ శాఖ సిబ్బంది, డిడబ్ల్యూఒ సిబ్బంది మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో మొత్తం 20 చోట్ల 4600 మొక్కలు నాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అవుత్సాహికులు రూపక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చారు..!

ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అవినీతి, అసమర్థ వైసిపి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు కూకటి వేళ్లతో కూల్చిపారేశారని ఉమ్మడి అనంతపురం జిల్లాల టిడిపి అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, వడ్డే అంజినప్పలు తెలియజేశారు. బుధవారం నాడు అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ మంగళవారం నాడు వెలువడని ఎన్నికల ఫలితాలు రాష్ట్రం, జిల్లాలో కనివిని ఎరుగని రీతిలో ఎన్డీయే కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టరాని తెలిపారు. దేశంలోనే బలమైన పార్టీగా తెలుగుదేశం అవతరించిందని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్, బిజెపి ఆధ్వర్యంలో ఏర్పడిన ఎన్డీయే కూటమి రాష్ట్రంలో ఉన్న అహంకార జగన్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో కూల్చివేయించారన్నారు. వైసిపి నాయకుల అహంకారం, సైకో విధానాలు చూడలేక విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అని నమ్మి కూటమిని అధికారంలోకి తెచ్చారన్నారు. జిల్లా చరిత్రలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలు గెలవడం శుభపరిణామం అన్నారు. హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు వడ్డే అంజినప్ప మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోనూ జిల్లాలోనూ తెలుగుదేశం–జనసేన–బిజెపి కూటమికి వచ్చిన ఫలితాలు చరిత్రను సృష్టించాయన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్ర మోడీపై ఉన్న నమ్మకంతో ప్రజలు ఏకపక్ష తీర్పును ఇచ్చారన్నారు. గత ఐదు ఏళ్లుగా ప్రజలు జగన్ అవినీతి, సైకో విధానాలు, ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయారన్నారు. జగన్ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేవళ్ల మురళి, తెలుగుయువత పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురుబ నారాయణస్వామి, హిందూపురం పార్లమెంట్ నాయకు రమేష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు

దగ్గుపాటికి శుభాకాంక్షల వెల్లువ

అభిమానులతో సందడిగా టిడిపి అర్బన్ కార్యాలయం

దగ్గుపాటిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఎమ్మెల్యేగా గెలుపొందిన దగ్గుపాటి ప్రసాద్ కు శుభాకాంక్షల వెల్లువ కనిపిస్తోంది. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున పూలహారాలు, శాలువలతో సత్కరించారు. 50 డివిజన్లు, నాలుగు పంచాయతీల నుంచి నాయకులు తరలివచ్చి శుభాకంక్షాలు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషి వల్లే ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. వారు అందించిన సహకారం మరువలేనిదన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్‌లో తగిన ప్రధాన్యం ఉంటుందని దగ్గుపాటి స్పష్టం చేశారు. కాలనీల్లో విజయోత్సవాలు నిర్వహించుకునే సమయంలో సంయనంతో ఉండాలని సూచించారు. ఎక్కడా ఎవర్నీ కించపరిచేలా మాట్లాడటం, ఎవరికీ ఇబ్బందులు కల్గించడం వంటివి చేయవదన్నారు.

వర్షాలకు మొక్కజొన్న పంట మొలకెత్తగా ఆరబెట్టిన రైతులు

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేశారు. ప్రధానంగా మండల కేంద్రమైన బొమ్మనహాల్‌తో పాటు కల్లు దేవనహళ్లి, బండూరు, ఉద్దేహాల్, కొలగానహళ్లి, శ్రీధరఘట్ట, గోనెహాల్, సింగానహళ్లి, గోవిందవాడ, బొల్లనగుడ్డం గ్రామాల్లో రైతులు ఆయా పంటలను పెద్దఎత్తున సాగు చేశారు. అయితే పంటలు చేతికందే సమయంలో భారీ వర్షాలు కురిసాయి. దీంతో రైతులు ఆయా పంటలను నష్టపోయారు. వర్షాల కారణంగా మొలకెత్తిన మొక్కజొన్న, తడిచి రంగు మారిన పత్తి దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఇంటి వద్ద అభిమానుల సందడి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన అంబికా లక్ష్మీనారాయణకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురం బెంగళూరు జాతీయ రహదారి పక్కన సాక్షి ఆఫీస్ సమీపంలో ఉన్న ఎంపీ అంబికా నివాసం వద్ద భారీ ఎత్తున టిడిపి మద్దతుదారులు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పూలమాలలో వేసి, శాలువాలతో సత్కరించారు. ఉదయం నుంచి అభిమానులతో ఇంట్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలుతెలియజేశారు.

'పురం'లో టిడిపికి తగ్గని ఆదరణ

పారని పెద్దిరెడ్డి పాచికలు - ఒక్క రౌండ్ మినహా అన్నింటా బాలయ్య మెజార్టీ



ప్రజాశకి-హిందూపురం

టిడిపి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులే ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఇక్కడి నుండి మూడుమార్లు పోటీ చేసి రెండు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్టీఆర్ అనంతరం ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ సైతం ఇక్కడ నుండి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సిసి వెంకటరాముడు, పామిశెట్టి రంగనాయకులు, అబ్దుల్‌ఘనీ ఇక్కడ నుండి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేలుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం వరుసగా నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ విజయాలను నమోదు చేశారు. వైసిపి నాయకులు ఎన్నికల ప్రచార సందర్భంలో బాలకృష్ణ స్థానికేతరుడని స్థానికంగా అందుబాటులో ఉండడని, ప్రజా సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని తదితర విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకర్షించుకునే ప్రయత్నం చేశారు. అయితే వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ ఏకంగా 32,597 ఓట్ల మెజార్టీతో బాలకృష్ణ విజయం సాధించారు. ఈ సారి ఎలాగైనా హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గంలో వైసిపి జెండాను ఎగర వేయాలని మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి ఎత్తులకు పైఎత్తులు వేశారు. ఇది చాలదన్నట్లు బిసి మంత్రం, మహిళా మంత్రాన్ని ప్రయోగించినప్పటికి పుర ప్రజలు బాలయ్యకే మళ్లీ పట్టం కట్టారు. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో ఒక్క తొమ్మిదవ రౌండ్ మినహా మిగిలిన అన్ని రౌండ్లలోను బాలకృష్ణ ఆధిక్యతను కనబరుస్తూ వచ్చారు. తొమ్మిదవ రౌండ్లో బాలకృష్ణకు 5253 ఓట్లు రాగా దీపికకు 5773 ఓట్లు వచ్చాయి. దీంతో ఆ రౌండ్లో దీపికకు 520 ఓట్ల ఆధిక్యత లభించింది. ఆ రౌండ్ మినహా ఇక మిగిలిన అన్ని రౌండ్లలోను బాలకృష్ణ స్పష్టమైన ఆధిక్యతను కనబరుస్తూ దూసుకెళ్లారు. మొత్తం 19 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించగా మొదటి రౌండ్లో 1994, రెండో రౌండ్లో 5619, మూడవ రౌండ్‌లో 247, నాల్గవ రౌండ్‌లో 1699, ఐదవ రౌండ్‌లో 1391, ఆరవ రౌండ్‌లో 1763, ఏడవ రౌండ్‌లో 1810, ఎనిమిదవ రౌండ్‌లో 4730, పదో రౌండ్‌లో 2144, 11వ రౌండ్‌లో 2593, 12వ రౌండ్‌లో 1199, 13వ రౌండ్‌లో 2444, 14వ రౌండ్ లో 729, 15వ రౌండ్‌లో 1302, 16వ రౌండ్‌లో 346, 17వ రౌండ్‌లో 1560, 18వ రౌండ్‌లో 577, 19వ రౌండ్‌లో 215 ఓట్ల చొప్పున బాలకృష్ణ మెజారిటీ సాధించారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్‌లో నందమూరి బాలకృష్ణకు 1472 ఓట్లు రాగా దీపికకు 47 ఓట్లు వచ్చాయి. మొత్తం బాలకృష్ణకు 1, 07,250 ఓట్లు రాగా దీపికకు 74,653 ఓట్లు దక్కాయి. దీంతో బాలకృష్ణ 35,597 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఫలితాలను బట్టి చూస్తే హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పై అభిమానం ఆటు ప్రజల్లోనూ ఇటు అభిమానులను ఏమాత్రం తగ్గలేదన్న విషయం అర్థమవుతుంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'లో ప్రముఖుల పిలుపు

అనంతపురంలో ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్క నాటుతున్న సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి గోవర్ధన్ శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.జయమారుతి, అరుణ్ ఐస్ క్రీమ్స్ డిస్ట్రిబ్యూటర్ రాఘవేంద్ర పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రం అనుబంధ సంస్థలైన ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. బిసాటి భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాన్నారు. ఐక్యరాజ్యసమితి సంస్థ ప్రతి సంవత్సరం ఒక నినాదంతో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందని, అందులో భాగంగా 2024 ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున 'భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకొనే శక్తి' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలను నాటి వాటిని పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో రైపర్ కళాశాల ఎన్ఎస్ఎస్ స్టూడెంట్స్ కోఆర్డినేటర్ ఎం.కిరణ్‌సాయి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు వై.పవన్, ఎస్.రాజా, ఎస్.నవని, జశ్విత్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుత్తి : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించు కోవచ్చని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో అటవీశాఖ సహకారంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు దాదాపు 100 మొక్కలు నాటారు. వీకే.పద్మావతమ్మ మాట్లాడుతూ విరివిగా మొక్కలు పెంచడం ద్వారా వాతావరణ సమతుల్యం లోపించదని, వర్షాలు బాగా కురుస్తాయన్నారు. ప్రజల విధిగా మొక్కలను నాటి పరిరక్షిస్తే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారి నారపరెడ్డి, అటవీ బీట్ అధికారి రమేష్ బాబు, గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురయ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లతోనే మానవ మునుగడ

పెద్దపప్పూరు : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, జీవులు నాణ్యమైన గాలి పీల్చుకొని ఆరోగ్యంగా జీవించాలంటే పచ్చని చెట్లను పరిరక్షించాలని ఐసిడిసి సూపర్వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి సూచించారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరి పై ఉన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక రామకోటి కాలనీలోని అంగన్వాడీ సెంటర్‌లో వారు మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల ఆవరణలో పచ్చని చెట్లను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, కిశోర్ బాలికలు, తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులు మొక్కలను పెంచాలి

రాయదుర్గం రూరల్ : పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా విరివిగా మొక్కలు పెంచాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆంజనేయులు సూచించారు. పట్టణంలోని కే.టీ.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ఎన్.ఎస్.ఎస్, ఎన్‌సిసి విభాగాలు, అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది, ఎన్‌సిసి, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు కళాశాల ఆవరణలో 150 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, విశ్వనాథ్, గోపాల్, రవి, అధ్యాపకులు వినోద్‌కుమార్, రఘు, బోధనేతర సిబ్బంది అస్లాం, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

వజ్రకరూరు : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో హనుమంతప్ప వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే మొక్కలను విరివిగా పెంచాలని సూచిస్తూ మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ షిరిడీ సాయి ఆలయ ప్రాంగణంలో పిల్లలకు 'ప్రకృతి-పర్యావరణం' అనే అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు భూమిపై ఎండల తీవ్రత తగ్గాలన్నా, వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంత మేరకు ఇళ్లు, పొలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్లను రక్షించి ఆరోగ్యాన్ని పంచుదాం

బుక్కరాయసముద్రం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామం అంగన్వాడీ కేంద్రంలో మునగ, జామ, కరివేపాకు చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా అధికారి సుధారాణి హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుధారాణి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. చెట్ల వల్ల మంచి ఆరోగ్యంతో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. చెట్ల వల్ల పచ్చదనం, నీడ లభిస్తుందన్నారు. స్వచ్ఛమైన గాలి వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క నాటాలి అన్నారు. జామ, ఉసిరి, మునగ, కరివేపాకు, నిమ్మ వంటి చెట్లు మంచి పండ్లు ఇస్తాయన్నారు. వీటిని గర్భిణలు, బాలింతలు ఆహారంగా తీసుకోవడం వల్ల పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, శింగనమల సిడిపిఒ ఉమాశంకరమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అన్నపూర్ణదేవి, నాగమణి, వనజాక్షి, అంగనవాడీ కార్యకర్తలు విమల, సుజాత, శైలజ, సుశీలమ్మ, అలివేలమ్మ, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో..

రాయదుర్గం : కే.టీ.ఎస్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన అటవీశాఖ అధికారులు, విద్యార్థులు

పెద్దపప్పూరు : రామకోటి కాలనీలోని అంగన్వాడీ సెంటర్‌లో మొక్క నాటుతున ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు, అటవీశాఖ అధికారులు

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో మృతి చెందిన నాగభూషణ, హనుమక్క

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- వజ్రకరూరు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివ రాలు.. రాకెట్ల గ్రామానికి చెందిన దాసరి నాగభూషణ(52) సొంత ఆటోలో కాయగూరలు తీసుకొచ్చి రాకెట్ల గ్రామంలో అమ్మేవాడు. అదే గ్రామానికి చెందిన బోయ హనుమక్క(63) కూరగాయల వ్యాపారం చేయడానికి రాకెట్ల గ్రామం నుంచి ఉరవకొండకు ఆటోలో వెళ్తుండగా గ్రామ సమీపంలో ఉరవకొండ నుంచి వస్తున్న కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలిసినే వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు భీమ్‌రెడ్డి ఆర్థికసాయం

రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తనయుడు భీమ్‌రెడ్డి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకొని మృతదేహాలను సందర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు దహన ఖర్చులకు బోయ హనుమక్క కుమారులకు రూ. 10 వేలు, దాసరి నాగభూషణ కుమారులకు రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ఆవు పొడిచి మహిళా రైతుకు గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

ఆవు పొడవడంతో గాయపడిన శివమణి

మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో బుధవారం ఆవు పొడవడంతో ఓ మహిళా రైతు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన మహిళా రైతు శివమణి తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా అక్కడే ఉన్న ఆవు బెదిరి ఆమెను పొడిచింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం శివమణిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అనంతపురం నగరంలోని పదో డివిజన్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

పదో డివిజన్‌లో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రవ్యాప్తంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు అఖండ మెజారిటీతో గెలుపొందడంతో బుధవారం నగరంలోని పదో డివిజన్‌లో టిఎన్‌టియుసి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు, కాలనీ ప్రజలు కేక్ కట్ చేసి, పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. అనంతరం దగ్గుపాటి ప్రసాద్ కార్యాలయం వద్దకు వెళ్లి గజమాలతో సత్కరించారు. లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలనకు చమర గీతం పాడి సైకిల్ పాలనకు స్వాగతం పలికిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం నగరంలో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు 23 వేలకు పైగా మెజారిటీని ఇవ్వడం చాలా సంతోషం కలిగించిందని తెలిపారు. నగరంలోని వాణిజ్య వ్యాపారులు, కార్మికులు, కర్షకులు, ఆటో డ్రైవర్లు, టైలర్లు, మహిళలు, నగర ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ దగ్గుపాటి ప్రసాద్ మంచి మన్ననలు పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నా క్యాంటీన్లు, టిడ్కో గృహాలను ప్రారంభిస్తామని నిరుపేదలకు నిత్యం అందుబాటులో ఉంటూ సంక్షేమం, అభివృద్ధి అందిస్తారని తెలిపారు. సైకిల్ హవాకు ఫ్యాన్ తునాతునకలైందని తెలిపారు. కార్యక్రమంలో పదో డివిజన్ ఆంజనేయులు, వెంకటరాముడు, పోతుల మంజునాథ్, కుల్వంత్, రాజేశ్వరి, బాబాఫకృద్దీన్, శ్రీధర్, విజయ్‌కుమార్, దాసరి పెద్దన్న, నాగరాజు, చికెన్ గోపాల్, మున్వర్, సూరి, రాము, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసిన ఆకుల బాబు, టిడిపి నాయకులు

బండారు శ్రావణి ఇంటి వద్ద కోలాహలం

ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారు శ్రావణి శ్రీని అభినందించ డానికి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున తరలిరావడంతో ఆమె ఇంటి వద్ద కోలాహలం నెలకొంది. వారితో శ్రావణశ్రీ మాట్లాడుతూ తన విజయానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నా అన్నారు. అనంతరం ఆమె ర్యాలీగా తన స్వగ్రామమైన సిద్ధరాంపురం తరలి వెళ్లారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు, జిల్లా నాయకులు వెంకట నరసానాయుడు, ఆకుల ప్రసాద్, ఆకుల విజయ్‌కుమార్, ప్రతాప్‌చౌదరి, ఆకుల అనిల్, ఆకులతేజతో పాటు జనసేన నాయకులు రామకృష్ణ, తుపాకుల భాస్కర్, తదితరులు బండారు శ్రావణిశ్రీని కలిసి అభినందనలు తెలిపారు.

బండారు శ్రావణిశ్రీ గజమాలతో సత్కరించిన అభిమానులు

శింగనమల ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారు శ్రావణిశ్రీని, ఆలం వెంకటనారాయణని, బొందలవాడ శివకృష్ణ చౌదరిని టిడిపి శ్రేణులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బండారు శ్రావణిశ్రీ, ఆలం వెంకటనారాయణ, బొందలవాడ శివకృష్ణ చౌదరిని గజమాలతో సత్కరిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

విలేకరులతో మాట్లాడుతున్న సునీలయాదవ్

గుత్తి మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ రాజీనామా

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మార్కెట్ యార్డ్ పాలకమండలి ఛైర్‌పర్సన్ చెవుల సునీలయాదవ్ బుధవారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందడంతో ఆమె తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. గుంటూరు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారులకు తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని అధికారులను కోరినట్లు ఆమె తెలిపారు.

కవితా సంపుటిలకు ఆహ్వానం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతిష్ఠాత్మకమైన విమల స్మారక 'విమల శాంతి సాహిత్య పురస్కారం-2024' కోసం జాతీయ స్థాయిలో కవుల నుంచి 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురించబడిన వచన కవితా సంపుటిలను ఆహ్వానిస్తున్నట్లు శాంతి నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవులు తమ కవితా సంపుటాలు నాలుగేసి కాపీలను జూలై 15వ తేదీ లోపు ఉప్పరపాటి వెంకటేశులు, 16-37-1, రాహుల్ నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం-515004 చిరునామాకు పంపాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలోని మండలపాడు వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు తల్లిదండ్రులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు మండలపాడులోని ఎపి మోడల్ స్కూల్ తాడిపత్రిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, 7, 8, 9వ తరగతుల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీని కలిసిన మాజీ వైస్ ఎంపీపీ

ప్రజాశక్తి-నార్పల

అనంతపురం పార్లమెంట్ సభ్యులుగా గెలిచిన వాల్మీకి ముద్దుబిడ్డ అంబికా లక్ష్మీనారాయణను బుధవారం నార్పల మాజీ వైస్ ఎంపీపీ నడిమి దొడ్డి తలారి తిప్పన్న కలిసి పూల బొకే ఇచ్చి శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు. అంబికా లక్ష్మీనారాయణను భారీ మెజార్టీతో గెలిపించిన అనంత పురం పార్లమెంటు నియోజకవర్గ ఓటర్లకు తిప్పన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే సవితమ్మను కలిసి పూలమొక్క అందజేస్తున్న బొందలవాడ శివకృష్ణచౌదరి

ఎమ్మెల్యే సవితమ్మను కలిసిన 'బొందలవాడ'

అనంతపురం : పెనుగొండ ఎమ్మెల్యేగా గెలిచిన సవితమ్మను బుధవారం టిడిపి యువ నాయకులు, శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శాలువాతో సత్కరించారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బరాజు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎంపీడీవో

వజ్రకరూరు : సచివాలయాల సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని ఉరవకొండ ఎంపీడీవో సుబ్బరాజు హెచ్చరించారు. ఆయన బుధవారం ఉరవకొండలోని సచివాలయం-1తో పాటు బూదగవి సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. హాజరుతో పాటు సచివాల య పరిధిలో ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన తప్పకుండా పాటించాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి జయరాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిసిన టిడిపి నాయకులు

నూతన ఎమ్మెల్యే, ఎంపీలను కలిసిన టిడిపి నాయకులు

పుట్లూరు : సార్వత్రిక ఎన్నికల్లో శింగనమల ఎమ్మెల్యేగా గెలుపొందిన బండారు శ్రావణిశ్రీతో పాటు అనంతపురం ఎంపీగా గెలుపొందిన అంబికా లక్ష్మీనారాయణను బుధవారం పలువురు టిడిపి నాయకులు వారి నివాసాలకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డిపల్లి రామురెడ్డి, నరేష్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, పుట్లూరు పుల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, తలారి వెంకటరాముడు, బాలాపురం సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, రామచంద్రనాయుడు ఉన్నారు.

బీసీ సమాఖ్య అధ్యక్షుడు సురేష్‌కు సన్మానం

గుత్తి : ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఈ.సురేష్‌గౌడ్‌కు మంగళవారం పలువురు సన్మానం చేశారు. ముందుగా సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ప్రభంజనం సృష్టించడంతో సంబరాలు చేసుకున్నారు. కేఈ.సురేష్ గౌడ్ ఇంటి వద్ద బాణసంచా పేల్చారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అలాగే పలువురికి స్వీట్లు తినిపించారు. అనంతరం కేఈ.సురేష్ గౌడ్‌ను ఏపీ బీసీల ఫెడరేషన్ సభ్యులు, అభిమానులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. గుంతకల్లు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరాం గెలుపునకు కేఈ.సురేష్ గౌడ్ తన వంతు కృషి చేశారని వారు కొనియాడారు.

రాయదుర్గంలో కేక్ కట్ చేస్తు తెలుగుతమ్ముళ్లు

తెలుగుతమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్రంలో, రాష్ట్రంలో, రాయదుర్గం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు సందర్భంగా బుధవారం రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పార్టీ గెలుపు పట్ల ఒకరికొకరు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుకొ న్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం అనంతపురం వెళ్లి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును ఆయన నివాసంలో కలిసి శుభాకంక్షలు తెలిపారు. అలాగే పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. వారి వారి గ్రామాల్లో పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. పలువురికి మిఠాయిలు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో కాలవ శ్రీనివాసులు పడ్డ కష్టానికి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు.

శోదనపల్లిలో ....

శింగనమల : బండారు శ్రావణిశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా బుధవారం మండల పరిధిలోని శోదనపల్లి గ్రామ పంచాయతీలో టిడిపి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. దుర్గమ్మ దేవతకి జాతర చేసి మొక్కుబడి చెల్లించారు. కార్యక్రమంలో పేట శివారెడ్డి, అట్టే రామాంజనేయులు, పేట ప్రసాద్‌రెడ్డి, అమ్మలదిన్నె ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, అట్టే శంకరయ్య, అట్టే కంబయ్య, అట్టే పెద్ద చౌడప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును శాలువాతో సత్కరించిన నాయకులు

గుమ్మనూరు ఈశ్వర్‌కు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-పామిడి

గుంతకల్లు ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరామ్ గెలుపొందిన సందర్భంగా బుధవారం ఆలూరు పట్టణంలోని గుమ్మనూరు జయరామ్ స్వగృహంలో ఆయన కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్‌ను పలువురు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గుంతకల్లు నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షులు ఆవుల శివ పుట్టినరోజు సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ సమక్షంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పామిడి 3వ వార్డు యువ నాయకుడు పురుషోత్తం, దశరథుడు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షుడికి 'కాపు' అభినందనలు

ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలుపు నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకులు కాపు రామచంద్రారెడ్డి బుధవారం టిడిపి రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజును కలిసి అభినందించారు. ఉదయం వాకింగ్ సందర్భంగా లక్ష్మీ బజార్‌లోని వర్షిని ప్యారడైజ్ వద్ద నాగరాజు, పార్టీకి చెందిన ఇతర నాయకులను కలిశారు. కూటమి గెలుపు పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

పసుపులేటి నాగరాజును అభినందిస్తున్న కాపు రామచంద్రారెడ్డి